నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,19 నవంబర్ 2024 8 పేజీలు

## పోగొట్టుకున్న బంగారు గొలుసు తిరిగి అప్పగించిన పోలీసులు



**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:** కొయ్యలగూడెంకు చెందిన ఆకుల లక్ష్మి అనే ఆమె ప్రయాణం సమయంలో తన బ్యాగులో నల్లపూసల తాడు సుమారు మూడు కాసుల ఉన్నటువంటిది పోగొట్టు కోగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు.ఈవిషయము గురించి కొయ్యల గూడెం ఎస్ఐ చంద్రశేఖర్‌కి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి గణేష్ అనే కానిస్టేబుల్ ద్వారా పోయినటువంటి బంగారపు గొలుసును గురించి దర్యాప్తు చేశారు.ఆనల్లపూసల తాడును వెంటనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎక్కడ పడి పోయినది అనే విషయాన్ని గమనించి పోలీసులు బంగారపు గొలుసును లక్ష్మీ భర్తకు అప్పగించారు. ఈ సందర్భంగా బంగారపు గొలుసు పోగొట్టుకున్న లక్ష్మీ, ఆమె భర్త చాలా సంతోషంతోఎస్ఐ చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.







### డబ్బుల కోసం ప్రజలను పీడిస్తే

# సహించేది లేదు

**– ఇష్టం వచ్చినట్లు పనిచేసే అధికారులపై శాఖ పరమైన చర్యలు**
**– ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హెచ్చరిక**

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అధికారులు ఎవరైనా డబ్బులకోసం ప్రజలనుపీడిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హెచ్చరించారు. టి.నరసాపురంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్ ప్రసంగించారు. అధికారులు ఇష్టం వచ్చినట్లుపనిచేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యకర్తలు ఎవరైనా నాయకులు, అధికారులకు ఒక్కరూపాయి ఇవ్వకుండా పని చేయించుకోవాలని సూచించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి నిర్వాసితుల సమస్యలు వివరిస్తానని ఎంపీ పేర్కొన్నారు. సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా - తరువాయి 2లో..



## యుద్ధ ప్రాతిపదికన అపార్ నమోదు

**– డిశంబరు 31 కల్లా సిసి రోడ్ల నిర్మాణం**
**: ఇసుక సరఫరాపై చర్యలు**
**– ఇంటింటి సర్వే వేగవంతం చెయ్యాలి : జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** అపార్ నమోదు ప్రక్రియ వేగవంతంగా చేసి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలం నంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో అపార్ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలలు,అపార్ నమోదు ప్రక్రియను మండలాల వారీగా సమీక్షించారు. కొన్ని మండలాల్లో అపార్ నమోదు ప్రక్రియ వెనుకబడి ఉండటంపై దానికి సంబంధించిన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో ఆధార్ నమోదు కేంద్రాలు 45 ఉన్నాయని, ఏ మండలంలో నమోదు ప్రక్రియ వెనుకబడివుందో ఆ మండలానికి మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి - తరువాయి 2లో..

## సీఎం సహాయ నిధికి రూ.2లక్షల 1000 విరాళం

**ఏలూరు,మేజర్‌స్యూస్:** స్థానిక పవర్ పేట బడేటి క్యాంపు కార్యాలయంలో హెూల్ సేల్ అండ్ రిటైల్ మెడికల్ అసోసియేషన్ వారు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.2లక్షల 1000 శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి చెక్కుని అందజేశారు.



## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎంఏ షరీఫ్





**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ, అభివృద్ధిపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ మైనార్టీ సలహాదారు, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు.సోమవారం స్థానికతెలగా కళ్యాణ మండపం లో ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే బొమ్మిడినాయకర్లకు సత్కారం చేశారు.ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలించిన ఐదేళ్ల రాష్ట్రాన్ని అప్పులఊబిలో నెట్టిందని, వాటన్నింటినీ సరి చేసుకుంటూ హామీలు అమలు చేసుకుంటూ ముందుకువెళ్తున్నట్లు తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, - తరువాయి 2లో..





## భీమవరం బ్లడ్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ నాగరాణి,**
**రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరంలో అందుబాటు లోకి వచ్చిన రక్త కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం భీమవరం రాయలంలో నూతన రక్త కేంద్రాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ - తరువాయి 2లో..

# పట్టభద్రుల ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలి



**భీమవరం,మేజర్ న్యూస్:** పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ జారీచేసిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా రూపొందించి, ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈసీఐ షెడ్యూల్ ప్రకారం నవంబర్ ఆరో తేదీతో ఫారం 18,19 స్వీకరణ గడువు ముగిసింది అన్నారు. ఈనెల 20వ తేదీన డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ ఉంటుందని, 23వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకటన, నవంబర్ 23 నుండి డిసెంబర్ 9 వరకు క్లెయిమ్స్,అభ్యంతరాలు స్వీకరణ, డిసెంబర్ 25వ తేదీన క్లెయిమ్స్, అభ్యంతరాలు పరిష్కారం, అదే రోజు ఓటర్ల జాబితా ప్రచురణ,డిసెంబర్ 30 తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో 67,793 మంది ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ మర్రాపు సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి మరపట్ల శ్యాంబాబు,బిజెపి పార్టీ గోవర్ధన్, బహుజన సమాజ్ వాది పార్టీ ఎం.రత్నరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ వంశి రెడ్డి, కె.రాజ్ కుమార్, ఆర్ జార్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి చింతమనేని,జనసేన రెడ్డి అప్పల నాయుడల స్నేహ బంధం





**ఏలూరు,మేజర్ న్యూస్:** విజయవాడ నుంచి ఏలూరు వస్తూ జాతీయ రహదారిపై స్వల్ప రోడ్డు ప్రమాదానికి గురైన ఆర్టీసీ విజయవాడ డివిజన్ రీజినల్ చైర్మన్,జన సేన ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్నేహ హస్తం అందించారు. ప్రమాదంలో దెబ్బతిన్న రెడ్డి అప్పల నాయుడు ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనం. అదే సమయంలో విజయవాడ నుంచి ఏలూరు వస్తూ జరిగిన ప్రమాద సంఘటనను గమనించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జనసేన ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడును పరామర్శించి, ప్రమాద ఘటనపై ఆరా తీశారు. షోరూంకి పంపెలా తన వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి,రెడ్డి అప్పల నాయుడును స్వయంగా తన కార్‌లో ఎక్కించుకుని చింతమనేని ప్రభాకర్ ఏలూరు తీసుకు వచ్చారు.

## కాపుల కళ్యాణ మండపం కలేనా ?

పాలకొల్లు,మేజర్ న్యూస్: కాపుల కళ్యాణమండపం కలగానే మిగిలిపోయిందని పలువురు అనుకుంటున్నారు, బొండాదు వారి వీధిలో కళ్యాణ మండపానికి సంబంధించిన స్థలం ఉంది, ఆ స్థలం సరిపోకపోవడంతో వేరొక చోట స్థలం సేకరించి కళ్యాణ మండపం నిర్మించాలని సన్నాహాలు ఎప్పటినుంచో చేస్తున్నారు, కాపు సామాజిక వర్గానికి చెందిన అనేకమంది ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా మంత్రు లుగా పదవులు చేపట్టినప్పటికీ ఈ విషయంపై మీమాంసగా ఉన్నారు,అతి పెద్ద సామాజిక వర్గం అయిన కాపు సామాజిక వర్గం అనేకమంది ఆర్థిక పరిపుష్టి ఉన్న వాళ్ళు ముందుకు రాకపోవడం, ఉన్నత పదవులు పట్టించుకోకపోవడం కారణమా అనేక సందర్భాలలో నిర్వహించినప్పుడు విషయం ప్రస్తావనికి పెదవెనిన పెదుతున్నారని పలువురు అంటున్నారు.

## జీలకర్రగూడెంలో తపన ఫౌండేషన్ చే ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం






కామవరపుకోట,మేజర్ న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను తపన ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు మహిళల ఆర్థిక అభివృద్ధికి గారపాటి చౌదరి చేస్తున్న కృషి అభినందనీయం అని జీలకర్రగూడెం ఎంపిటిసి కంఠమనేని పుష్పరాజ్యం అన్నారు. కామవరపుకోట మండలం జీలకర్ర గూడెం గ్రామంలో సోమవారం తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసి కంఠమనేని పుష్పరాజ్యం మాట్లాడుతూ 90 రోజులు పాటు నిర్వహించే ఈ ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని జీలకర్రగూడెం మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీలకర్రగూడెం గ్రామ సర్పంచ్ గోరింక దాసు, బిజెపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఏసు వరప్రసాద్, బాలరాజు, కటాకం సత్యనారాయణ, చెలకాని భాస్కర్ రావు, జాలమర్తి నాగబాబు,సత్యనారాయణ ,నాగు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం బ్లడ్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

సొసైటీ జిల్లా ప్రెసిడెంట్,కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ చైర్మన్ డా. శ్రీధర్ రెడ్డి రక్త నిధి కేంద్రంలోని వివిధ విభాగాలను సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం రాయలంలో రక్త కేంద్రానికి ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ ద్వారా సమకూర్చిన నిధులు రూ.2.50 కోట్లతో అవసరమైన మిషనరీ, పరికరాలు తదితరాలను ఏర్పాటు చేయడం జరిగిందని నాగరాణి అన్నారు. జిల్లాలో రక్త లభ్యతను మెరుగు పరుస్తున్నామని ముఖ్యంగా ప్రస్తుత రక్తం కొరత నేపథ్యంలో నరసాపురం, తణుకులో ఇప్పటికే ఉన్న రెడ్ క్రాస్ రక్త కేంద్రాలకు అదనంగా ఇది ప్రజలకు సేవలు అందజేయడానికి దోహద పడుతుందన్నారు.రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ డా.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకలెక్టర్ సహాయ సహకారాలతో రక్త కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులో తీసుకొచ్చి భీమవరంలో ఏర్పాటు చేసుకొని ప్రారంభించుకోవడం శుభపరిణామం అన్నారు. రక్త కేంద్రాన్ని కొత్త జిల్లా అయిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు కేటాయించి,రూ.2.50 కోట్ల విలువ కలిగిన పరికరాలతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రెసిడెంట్ గౌరవ గవర్నర్, రాష్ట్ర చైర్మన్ చొరవతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో రూ.60 లక్షల రూపాయలు విలువ కలిగిన మొబైల్ బ్లడ్ డోనార్ వాహనాన్ని జిల్లాకు సమకూర్చనున్నట్లు తెలిపారు. భీమవరం నందు బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివరామ బద్రిరాజు ఎంతో కృషి చేశారని, రక్త కేంద్రం లైసెన్సు పొందడం చాలా శ్రమతో కూడుకున్న పని అన్నారు. ఢిల్లీ స్థాయిలో లైసెన్స్ పొందాల్సి ఉందని వీటన్నింటిని డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్ బద్రిరాజు ఎంతో శ్రమ, పట్టుదలతో సాధించారని వీరి సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భీమవరం శాఖ చైర్మన్ ఎం.ఎస్.వి.ఎస్ బద్రిరాజు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ సమకూర్చిన రూ.2.50 కోట్లతో పాటు, జిల్లా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు అందజేసిన విరాళాల మొత్తాలతో రక్త కేంద్రాన్ని పూర్తి మౌలిక వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. చివరిగా రెడ్ క్రాస్ సొసైటీ రక్త కేంద్రం ఏర్పాటులో జిల్లా శాఖకు వివిధ విధాలుగా సహాయ సహకారాలు అందించిన వారికి శాలువా కప్పి, మెమొంటోళ్లను అందజేసి జిల్లా కలెక్టర్‌చే సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు కోళ్ల నాగేశ్వరరావు, సోమరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి,ఒమేగా హాస్పిటల్స్ డాక్టర్ ఆదిత్య, ఒమెక్స్ కొమ్ముల మురళీకృష్ణ, అడిషనల్ డిఎంహెచ్వో భాను నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, యూత్ హాస్టల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం సత్యనారాయణ, వెస్ట్ బెర్రీ కరస్పాండెంట్ మహేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్రాజీ, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ఓ.కనకరాజు, సిటిజన్ ఫోరం ప్రతినిధి రాజశేఖర్, రైతు కార్యాచరణ సమితి,సప్తగిరి గ్రామీణ బ్యాంకు, హెచ్డిఎఫ్సి బ్యాంక్ ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## డబ్బుల కోసం ప్రజలను పీడిస్తే సహించేది లేదు

మొదటిపేజీ తరువాయి

ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు వెల్లడించారు. పోలవరం నియోజకవర్గం పరిధిలోని రహదారులను అభివృద్ధి చేయడానికి తనకు కొంత సమయం ఇవ్వాలని, వచ్చే ఏడాది నాటికి రహదారులన్నీ నూతన శోభ సంతరించుకుంటాయని తెలిపారు. టీ నర్సాపురం ఎర్ర కాలవ బండి రేవు వంతెన నిర్మాణం కొరకు రైతులు కొనకళ్ళ మోహన్ కుమార్, ప్రసాదు,చాట్రాతి యుగంధర్ తోపాటు మరికొంత మంది రైతులు కలిసి ఎంపికి వినతిపత్రం అందజేశారు. త్వరలో మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా తాను చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని, కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత ఎక్కువ నిధులు రాబట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఎంపీ సూచించారు.స్థానిక నాయకులు జయ్యవరపు శ్రీరామ మూర్తి,రామకృష్ణ గౌడ్,నల్లూరి వెంకట చలపతి రావు,సూర్యనారాయణ,శీలం వెంకటేశ్వరరావు, నారాయణ, రామారావు, రాంబాబు,మాజీ సర్పంచ్ జోసు బోయిన సోంబాబు,సందెపూడి సాయి,కొల్లి రమేష్ అద్దంకి జగ్గారావు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన అపార్ నమోదు

మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలని జెడ్పి సిఇఓ కె.సుబ్బారావును ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా జిల్లాలో 983 సిసి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని కొన్ని మండలాల్లో సిసి రోడ్ల నిర్మాణం వెనుకబడివుండటానికి గల కారణాలను జిల్లా కలెక్టర్ యంపిడివోలను, పంచాయితీ ఏఇల ను ఆరా తీశారు. మండలాల వారీగా ఇచ్చిన సిసి రోడ్ల నిర్మాణా నికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిస్థాయిలో పూర్తిచేసి డిశంబరు 31 కల్లా పనులు పూర్తయ్యేలాగ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ మండలంలోనైనా వెండర్స్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతి కనబర్చకపోతే వారిని తొలగించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ గా సిసిరోడ్ల నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీలు మండలాల వారీగా నిర్వహిస్తానని తెలిపారు. జెడ్పి సిఇఓ, యంపిడివోలు సిసి రోడ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక ఉచితంగా తీసుకోవడానికే తప్పా అమ్ముకోవడానికి కాదని ఈ విషయాన్ని గ్రహించి సంబంధిత మండల యంపిడివో ఇసుక అవసరం ఉన్న వారికి పర్మిషన్ పత్రాన్ని జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కుక్కునూరు, కొవ్వూరులో అందుబాటులో ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన వారు ప్రక్క జిల్లా నుంచి కూడా నిబంధనల మేరకు ఇసుకను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. జిల్లాలో చేపట్టిన హౌస్ హెల్డ్ సర్వేపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి యంపిడివోలు, మున్సిపల్ కమీషనర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డ్వామా పిడి కె.వెంకట సుబ్బారావు,డిఇఓ వెంకటలక్ష్మమ్మ,డివిఇవో బి.ప్రభాకరరావు, ఆర్ఐ కె.చంద్రశేఖరబాబు, యంఇవోలు, యంపిడివోలు, పంచాయితీరాజ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎంఏ షరీఫ్

మొదటిపేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ప్రణాళిక బద్ధంగా అభివృద్ధిపై దృష్టి సారించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల గడవకముందే వైసీపీ పార్టీ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గర ఉండి ఏర్పాట్లు అన్నీ చేసి ప్రజా జీవనాన్ని సజావుగా సాగేందుకు పూర్తి కృషి చేశానన్నారు. రాష్ట్రంలో సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకొని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలో ఎంతో పురోగతి సాధించామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో త్వరలో నెరవేరుతాయి అన్నారు. తెలుగుదేశం పార్టీజిల్లా అధ్యక్షులురామరాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు తదితరులు మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన, బిజెపిలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తునహాజరయ్యారు. పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఎం ఎ షరీఫ్, కొత్తపల్లి సుబ్బారాయుడు, బొమ్మిడినాయకర్ లను ఈ సందర్భంగాఘనంగా సత్కరించారు.

# పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్**




**ఏలూరు,మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థానిక 16వ డివిజన్ అరుంధతి పేట సచివాలయం వద్ద ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలసి డివిజన్ కార్యదర్శి కొల్లూరి సుధారాణి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దేశంలో ఎవ్వరూ ఇవ్వనంతగా పేద ప్రజలకు 38 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని ప్రచార ఆర్భాటాలు చేసుకున్నారు. తప్ప ప్రజలకు అవసరమైన ఇంటి స్థలాన్ని మాత్రం కేటాయించలేక పోయారని విమర్శించారు. ఆనాటి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం అనేక దఫాలుగా ఇంటి స్థలాలను పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తుందని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఇంటి నిర్మాణంపై శ్రద్ధ వహించాలని కోరారు.అద్దె ఇళ్లల్లో ఉంటూ స్థలాలు మంజూరైన ఇళ్ళు నిర్మాణం చేయకపోవడంతో నగరంలోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, సమితి సభ్యులు లక్క పాము చిట్టిబాబు,ఉప్పులూరి రవి,జిజ్జువరపు సురేంద్ర, కొండేటి రాంబాబు, ఉప్పులూరి లక్ష్మి,భవాని తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణకు 2024 సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారం



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** గాయకుడు తాళ్లూరి బాలకృష్ణ లయబద్ధంగా అందునా స్త్రీ గొంతుతో రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల రసజ్ఞులను ముఖ్యంగా భక్తి గీతాలతో రంజింపచేస్తున్న స్వయం కృషితో పేదరికాన్ని అధిగమించి రాణించటం స్ఫూర్తి దాయకం అని భగవాన్ బుద్ధ సేవా సమితి అధ్యక్షులు తాడిపర్తి సంపత్ రావు అన్నారు. సత్యవరం గ్రామంలో జరిగిన సేవా కార్యక్రమంలో స్థానిక గాయకుడు బాలకృష్ణ కు 2024 సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారంతో పాటు స్త్రీ గాత్ర శిఖామణి బిరుదు ను ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు, సభా నిర్వాహకుడు ఉన్నమట్ల మునిబాబు మాట్లాడుతూ విద్యా,కళా రంగాలకు చెందిన మాణిక్యాలను గత 25 సంవత్సరాలుగా వెలికి తీస్తున్న ట్రస్ట్ కృషి అభినందనీయమన్నారు,ఈ సందర్భంగా బాలకృష్ణ ఆలపించిన అమ్మ పాటలు ఆకట్టుకున్నాయి.

అనంతరం ఉన్నమట్ల వెంకట రావు,కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకా రంతో 40 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కేతా రామకృష్ణ, దళిత గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మట్టి చంద్ర ప్రసాద్, వార్డు మెంబర్లు గడ్డం రాజేశ్వరి, గడ్డం రంగా గోగి బాబీ, పుట్ల ఈశ్వర్, నాని ఉన్నమట్ల ఇందిరాగాంధీ ,తాడి పర్తి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## శాఖా గ్రంధాలయంలో చదరంగం పోటీలు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** ప్రధమశ్రేణి శాఖ గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సోమవారం చదరంగం,మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. చదరంగం పోటీలును నరసాపురం చెస్ అకాడమీ గణేష్‌కుమార్ ప్రారంభించగా మట్ట సుధీర్ మోహన్ రీడర్స్ ఫోరం సభ్యులు నిర్వహించినారు. ఈ పోటీలలో మున్సిపల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్, గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్,సన్‌షైన్ లెనిన్ హైస్కూల్, చైతన్య,సికలే స్కూల్‌తదితర విద్యాసంస్థలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మ్యూజికల్ చైర్స్ పోటీలు,రన్నింగ్ రేస్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్లు ఆదాము,ఫనీ,వరప్రసాద్,శాస్త్రవేత్త సుబ్బారావు, సూర్యం బాబు, రమ, రన్నింగ్ రేస్ పోటీలు నిర్వహణ ఎస్ కే అలీషా టీచర్, శ్రీనివాస్, వెంకట్, ప్రవీణ్, జీవన్తదితరులు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజీఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు.

# నేటి నుండి భారత రాజ్యాంగం పై చైతన్య సమావేశాలు

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** దేశభక్తి భారత రాజ్యాంగం పేరుతో 19వ తేదీ నుండి 30వ తేదీ వరకు 12 రోజులు చైతన్య సమా వేశాలు నిర్వహించాలని హేలాపురి బాలోత్సవం ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం భారత బచావో బహుజన్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపుచ్చాయి. సోమవారం ఆ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది సమావేశానికి బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, భారత బచావో ఉభయగోదావరి జిల్లాల పెరియర్ పూలే అంబేడ్కర్, బోఫ్ కమిటీ నాయకులు ఎస్‌కె.ఖసిం, హేలాపురి బాలోత్సవం కమిటీ నాయకులు వివి రాంబాబు, ఎస్ రవి, వై నిర్మల,కే సోమ్లా నాయక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 12 రోజుల కార్యక్రమం బ్రోచర్ ను ఆవిష్కరించారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి 20వ తేదీన బాలల హక్కుల దినోత్సవం 21వ తేదీన సివి రామన్ వర్ధంతి,25వ తేదీన స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవం పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞ అమల్లోకి వచ్చిన రోజు 25వ తేదీన స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవం 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం 28వ తేదీన జ్యోతిరావు పూలే 134 వర్ధంతి ఫెడరీకి ఏంగెల్స్ 204వ జయంతి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భాలుగా కాలేజీల్లో రాజ్యాంగంపై ప్రశ్నావళి పోటీలు స్కూల్స్ కాలేజీల్లో సభను



జరపాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం పై నిర్వహించే సభల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వివిధ సంస్థలు 19వ తేదీ నుండి 30వ తేదీ వరకు వివిధ తేదీల ప్రాధాన్యత మీద విద్యాలయాల్లో చైతన్య అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించాలని పిలుపుని జయప్రదం చేయాలని కోరుతున్నామని అన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** పాలకొల్లు మాంటిస్సోరి స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ఆవరణలో, రఘు ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, పరిసర ప్రాంతాల పాఠశాలల హైస్కూల్ విద్యార్థులకు 8 విభిన్న ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు రూ.50,000 నగదు బహుమతి, మొమెంటోలు, సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. బహుమ తులను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బార్ కౌన్సిల్ సభ్యులు రాయవరపు వెంకట సూర్యనారాయణ చే ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటు వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కెవి కృష్ణ వర్మ మాట్లాడుతూ రఘు ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థుల అభ్యున్నతికి ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారిలో అనేక నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తుందని తెలియ చేసారు. ప్రిన్సిపాల్ ఎస్.పి.ఎస్. ప్రకాశరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ ,సోషల్ స్కిల్స్ పెరుగుతాయని తెలియచేసారు. ఈ వేడుకలలో టీచింగ్,నాన్‌టీచింగ్ స్టాఫ్,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



**పెనుగొండ,మేజర్ న్యూస్:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 2024 సెప్టెంబరు, అక్టోబర్ నెలలకు కార్మికులకు బకాయి వేతనాలు, మెనూ చార్జీలు వెంటనే చెల్లించాలని కోరుతూ తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిఐటియు నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కార్మికులపై రాజకీయ వేదింపులు పెరిగాయని వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతినెల 1వ తేదీని వేతనాలు చెల్లించాలని, మెనూ చార్జీలు ప్రతినెల 5వ తేదీన చెల్లించాలని కోరారు. ధరల కనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రతి విద్యార్థికి మెనూ చార్జి రూ 20 రూపాయలు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డు ఇచ్చి, ఉపాధి భద్రత కల్పించాలన్నారు. పథకంలో పనిచేసే కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, వంట కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 'అన్నే' మృతి



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అగిరిపల్లి మండల పరిధి కృష్ణవరం గ్రామ మాజీ పంచాయతీ సర్పంచ్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు అన్నే నాగేశ్వరరావు (90) ఆగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో సోమవారం మృతిచెందారు. అయనకు భార్య,ముగ్గురు కుమా రులు వున్నారు.జిల్లా,మండల రాజకీయ నాయకులు అందరు అన్నే నాగేశ్వరావుకు ఘనంగా నివాళ్లు అర్పించి, అన్నే కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

– గడువులోగా నాణ్యతతో కూడిన పరిష్కారం ఇవ్వాలి
– జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజాఫిర్యాదులుస్వీకరణ,పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలోఅర్జీదారుల నుంచి245 ధరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు, కె.భాస్కరరావు, ఎం.ముక్కంటితో కలిసి ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖా ముఖిగా మాట్లాడి ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలీస్ కేసులకు సంబంధించి చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పట్ల అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పరిష్కార వ్యవస్థలో అందిన ధరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉండాలన్నారు. ఫిర్యాదుదారులు విజ్ఞప్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాల్సిన భాద్యత అధికారులపై ఉందని కలెక్టర్ సూచించారు.

– అందిన అర్జీల్లో కొన్ని –దెందులూరు మండలం గాలాయిగూడెం కు చెందిన అందే సత్యనారాయణ అర్జీనిస్తూ తమ భూమిని తమ్ముడు కొడుకులు ఆక్రమించుకున్నారని, కనుక తన భూమికి శాశ్వత భూమిహక్కు రక్షణ కల్పించి భూమిని రీసర్వే చేయించాలని కోరారు. ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురం కు చెందిన ఎ.శ్రీనివాసరావు అర్జీనిస్తూ తమ భూమి రీ సర్వేలో అసైన్డ్ భూమిగా ఆన్ చూపిస్తున్నదని ఈ దృష్ట్యా తిరిగి రీ సర్వే చేయించాలని కోరారు. ఏలూరుకు చెందిన జి.భువనేశ్వరీ అర్జీనిస్తూ తన భర్త శారీరకంగా తీవ్రంగా గాయపర్చారని,దీంతో హాస్పటల్ ను ఆశ్రయించానని అతనిపై కేసుపెట్టేందుకు మెడికో లీగల్ కేసు రికార్డు చేయాలని పోలీసులను కోరానని ఈ విషయంలో సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ద్వారకా తిరుమల మండలం కొమ్మరకు చెందిన ఒక మహిళ అర్జీనిస్తూ తనను ఒక వ్యక్తి లైంగిక వేదింపులకు గురిచేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సెక్షన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలలు,గృహ నిర్మాణానికి నిధులు ఇవ్వాలి

**ఏలూరు రూరల్,మేజర్ న్యూస్:** సిపిఐ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కేయంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో ఇళ్ల స్థలం లేని పేదలచే సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ వర్మ కు అర్జీలు సమర్పించడం జరిగింది. చాటపర్రు సచివాలయం వద్ద గ్రామీణ పేదలతో ధర్నా జరిపి ఇండ్ల స్థలాల కోసం గ్రామ కార్యదర్శికి అర్జీలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీకేఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్నాలలో 2 సెంట్లు ఇంటి స్థలంతో పాటు 4 లక్షల నిర్మాణానికి ఇస్తామని హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం లేని ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి 4 లక్షల బదులు 5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని ఇసుక సిమెంటు ఇటుక ఐరన్ కంకర ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు




పుప్పాల కన్నబాబు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బుగ్గల ప్రభాకర్ మండల సమితి నాయకులు అరిగెల యోహాను,కోరాడ నాగేశ్వరరావు,బి రాజు,బి ఏసురత్నం రాము,ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులు మహిళలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 82 పోలింగ్ కేంద్రాలు





– రాజకీయ పక్షాల ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏలూరు జిల్లాలో మొత్తం 82 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు.సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో సంబంధిత పోలింగ్ కేంద్రాల ప్రతిపాద నలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ విశ్వేశ్వరరావు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్. నెలరాజు (బిజెపి),ఆర్. సత్యనారాయణ(ఆమ్ ఆద్మీపార్టీ),యు.బాలా నందం, ఎస్. అచ్యుతబాబు(టిడిపి), పి. కిషోర్(సిపిఎం), డి.రత్నబాబు, ఎస్.భరత్‌రావు (బిఎస్‌పి),రాజనాలరామ్మోహన్‌రావు(ఐఎన్‌సి),ఎం.వెంకట నాగరాజు (జెఎస్‌పి) పాల్గొన్నారు.ఈ సందర్బంగా డిఆర్ఓ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి ఏలూరు జిల్లాలో ఏలూరు డివిజన్ లో 33, నూజివీడు డివిజన్‌లో 6, జంగారెడ్డిగూడెం డివి జన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాధి ంచడం జరిగిందన్నారు. అదే విధంగా ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజ కవర్గానికి ఏలూరు జిల్లాలో ఏలూరు డివిజన్‌లో 8, నూజివీడు డివిజన్‌లో 20 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాధించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి నవంబరు 23వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు. అనంతరం ఈనెల 23 నుంచి డిశంబరు 9వ తేదీ వరకు క్లైయిమ్ లు,అభ్యంతరాలు సమర్పించ వచ్చన్నారు. డిశంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు.

ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి ఏలూరు జిల్లాకు ఇంతవరకు 40,890 ధరఖాస్తులు రాగా ఇంతవరకు 35,263 ఈఆర్ఓ లాగిన్ లో అప్ లోడ్ చేయడం జరిగిందన్నారు.

అదే విధంగా ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఏలూరు జిల్లాలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా 16,258 ధరఖాస్తులు రాగా ఇంతవరకు 9,673 పరిశీలించడం పూర్తయిందన్నారు. ఈనెల 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ఏవైనా డూప్లికేట్, ఇతర క్లైయిమ్‌లు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన సూచించారు.

### చిన్ననాటి నుండి పోటీ పరీక్షలపై మక్కువ పెంచుకోవాలి



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** శాఖ గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉద యం గ్రంథాలయా ధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులకు జనరల్ క్విజ్ పోటీలను నిర్వహించి వివిధ అంశాలలో నిర్వహించే ఈ క్విజ్ పోటీలు ద్వారా విద్యార్థులకు ఉన్న నాలెడ్జ్ ని పరీక్షించడమే కాకుండా చిన్ననాటి నుండి పోటీ పరీక్షలపై మక్కువ పెంచుకొని, భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలు రాసి విజేతలు కావడానికి దోహదం చేస్తాయని,పోటీ పరీక్షలలో విజేతలైన వారు గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను చదివిన వారే అని తెలియచేసి శాఖ గ్రంథాలయంలో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఉపయోగించుకోవాలని కోరారు.ఈ క్విజ్ పోటీలకు పర్యవేక్ష కులుగా గురుకుల ఉపాధ్యాయురాలు గోదాదేవి, శ్రీవారి దేవస్థానం ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి,గ్రంథాలయ సహా యకు రాలు బట్టు మణి విద్యార్థులు పాల్గొన్నారు.

## భీమడోలులో ఘనంగా కెమెరా సృష్టికర్త డాగూరే జయంతి



**భీమడోలు,మేజర్ న్యూస్:** కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే ఫోటోగ్రఫీలో నూతన శకానికి నాంది పలికారని భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్రాక్షారపు శ్రీరామ్ అన్నారు. సోమవారం భీమడోలు సంతమార్కెట్ వద్దనున్న కలాం, డాగూరే వేదిక వద్ద భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్విన్ మండే డాగురె జయంతి వేడుకలను ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. డ్యాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరమానందం మాష్టారు, భీమడోలు హైస్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం, సైన్స్ టీచర్ అహ్మద్, పోలసానిపల్లి గురుకులం ఉపాధ్యాయిణులు హేమలత,శ్యామణి టీచర్ లను దుస్సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ద్రాక్షారపు శ్రీరామ్,గౌరవ అధ్యక్షులు పిల్లి.బ్రహ్మారావు, నాయకులు ఏవి.రంగారావు, డి.డేవిడ్, పుల్లాభోట్ల రామ్మూర్తి, ఏవి నాగరాజు, కృష్ణ, సురేష్, మధు పాల్గొన్నారు.

## విమాన గోపురం స్వర్ణమయ పథకానికి రూ.1లక్ష విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయ విమాన గోపురానికి ఒక లక్ష విరాళం సమర్పించిన భక్తులు తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన మోహిర స్కంద ఉదయం స్వామి అమ్మవార్లను దర్శించుకుని తమ పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ఆఫీసు వద్ద సిబ్బందికి విమాన గోపుర స్వర్ణ మాయ పథకానికి ఒక లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు.దేవాలయ ఏఈఓ నటరాజ్ దాత కు బాండు పత్రాలను శ్రీవారి ప్రసాదాలను అందించి దాతను అభినందించారు.

# ఆయుధ డిపోతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు

**– ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వెల్లడి**

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** మండలంలో నిర్మించబోయే నేవీ ఆయుధ డిపో నిర్మాణంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అపోహలు నమ్మొద్దు అంటూ పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం జీలుగుమిల్లిలో మండల టిడిపి అధ్యక్షులు సుంకువల్లి సాయి ఇంటి వద్ద టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంకవారిగూడెం పంచాయతీలో రూ. 2,500 కోట్లుతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయుధ డిపో నిర్మాణం జరిగితే 6వేల మంది ఉద్యోగులు పనిచేస్తారని దానిలోని 4వేల మంది వరకు మన ప్రాంతానికి చెందిన వారిని నియమించేందుకు సంబంధిత అధికారులతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. చదువూరాని వారికి చదువుకున్న విద్యార్థులకు అన్ని రకాల ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. అంతేకాకుండా జీలుగుమిల్లి ప్రాంతంలో వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఆయుధ డిపో కర్మాగారం వల్ల నిర్వాసితులయ్యే వారికి ప్రతి ఒక్కరికి భూమికి భూమి, ఇంటికి ఇల్లు ఇచ్చి మెరుగైన పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. కొందరు భూకబ్జాదారులు మాటలు విని మండలప్రజలు ఈఅవకాశాన్ని చేజార్చుకోవద్దని ఆయనహితవు పలికారు. ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉందని, వారి జీవితాలలో ఆనందం తీసుకొచ్చేందుకు ఈడిపో నిర్మాణం ఎంతో దోహదపడు తుందన్నారు.



**– కార్యకర్తలకు అండగా ఉంటా –**పసుపు కండువా కప్పుకున్న ప్రతి కార్యకర్తకు అధికారులు పనిచేయాల్సిందే అని హెచ్చరించారు ఒకవేళ ఏ అధికారి అయినా పని చేయడం లేదు అని తమ కార్యకర్త చెబితే తానే దగ్గర కూర్చొని ఆ అధికారి చేత పనిచేపించే బాధ్యత తీసుకుంటానని కార్యకర్తలకు భరోసా కల్పించారు. జీలుగుమిల్లి మండలం ప్రతిసారి ఓట్లలో తక్కువ వస్తున్నాయని ప్రస్తుతం సభ్యత నమోదు గతం కంటే ఎక్కువగా చేయించి కార్యకర్తలకు భరోసా కల్పించి రానున్న ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుందాం అని పిలుపునిచ్చారు ప్రతి కార్యకర్త సభ్యత నమోదుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, టిడిపి సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, ఉండవల్లి సోమ సుందరం, మాజీ జడ్పిటిసి బాసిన రాజబాబు, నాలి శ్రీను, జాస్తి సత్యనారాయణ, చిర్రి వెంకటేశ్వరరావు, గూడపాటి అరుణ కుమార్, బుడిపిటి చిరంజీవి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మౌర్య రాజ్య పాలన,మేధో ఆలోచనలు పై వర్క్ షాప్



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ వై ఎన్ కళాశాల చరిత్రశాస్త్రము, రాజకీయ శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'మౌర్య రాజవంశం మేధో ఆలోచనలు విలువలు 'అనే అంశంపై ఒకరోజు వర్క్ షాప్ ను నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ వర్క్ షాప్ కి రిసోర్స్ పర్సన్ గా ఆంధ్ర ప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ జీవిత కాల సభ్యులు అడపా సత్యనారాయణ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 'క్రీ.పూ. 322 లో నంద సామ్రాజ్యాన్ని పడగొట్టి భౌగోళికంగా విస్తారమైన మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించి, ఇనుప యుగపు చారిత్రక శక్తిగా ఉండి, క్రీ.పూ 322– 187 మధ్య భారత ఉపఖండంలో దక్షిణ ఆసియాలో ఎక్కువ భాగంలో విస్తరించిన మౌర్య సామ్రాజ్యం ఇండో–గంగా మైదానాన్ని జయించి కేంద్రీకృతమై ఉన్న రాజ్యాన్ని చంద్రగుప్త మౌర్యుడు,చాణక్యుని (కౌటిల్యుడు) సహాయంతో ఒక సైన్యాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలోచినిమిల్లి శ్రీనివాస్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనక రావు,డీన్ డాక్టర్ గంధం శ్రీ రామకృష్ణ,చరిత్ర విభాగాధిపతి ఎస్.సోమ శేఖర్, రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.ఎస్.వి.రంగా రావు ,మల్లేశ్వర రావు,శ్యాంబాబు,భావ నారాయణ, మారుతి, షారోన్ పుష్ప, రాణి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**: ఆర్డీవో దాసి రాజు**



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వారధి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)డి రాజు అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో సుమారు 15 ఫిర్యాదులను ఆర్డీవో రాజు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నర్సాపురం రెవెన్యూ డివిజన్‌కి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. 14వ వార్డులో ఏటుగట్టు పొడవునా వృక్షాలు పెరిగిపోయాయని, వాటిని వెంటనే తొలగించి ఏటుగట్టును బలపరచాలని, స్మశాన వాటిక వరకు వృక్షాలు పెరిగిపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొల్లు పెద్దిరాజు వినతిపత్రం అందించారు.

# శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో గల శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలోకార్తీక సోమవారం సందర్భంగా అభిషేకములు, అన్నదానం నిర్వహించారు. సర్వ గ్రామ ప్రజల ధన సహాయంతోఈ కార్యక్రమం జరిగింది. పరిసర ప్రాంత గ్రామాలనుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్యనిర్వాహణాధికారి సిహెచ్ సురేష్ నాయుడు,సిబ్బంది ఎం.రమేష్ ఏర్పాట్లుచేశారు.

# నవ దంపతులను దీవించిన ఎమ్మెల్యే చిర్రి



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ కుమారుడు కోడలు భువన దత్త,రేఖ వివాహా రిసెప్షన్‌కు హాజరై నవ దంపతులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆశీర్వదించారు. సోమవారం గడ్డమణుగు రవికుమార్ నివాసం వద్ద ఏర్పాటుచేసిన రిసెప్షన్‌కు మాజీ శాసనసభ్యులు ప్రజా ప్రతినిధులు అధికారులు మండల ప్రజలు పాల్గొని నవ దంపతులను దీవించారు. అనంతరం సుమారు 4 వేల మందికి షడ్రుసులతో భోజనాలు పెట్టారు. రిసెప్షన్‌కి వచ్చిన ప్రతి ఒక్కరిని గడ్డమణుగు రవికుమార్ గీతా దంపతులు పేరుపేరునా పలకరించారు.

# సిపిఎం మండల కార్యదర్శిగా జల్లి రామమోహనరావు



నరసాపురం రూరల్, మేజర్ న్యూస్: మండలంలోని పసలదీవి గ్రామంలో సిపిఎం మండల మహాసభ జరిగింది. పార్టీ మండల కార్యదర్శిగా జల్లి రామ్మోహన్రావు ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌర్ పెద్దిరాజు తెలిపారు . పార్టీ మండల మహాసభ కొత్త మండల కమిటీ ఎన్నుకుంది. 11 మందితో మండల కమిటీ సమావేశమయ్యి కార్యదర్శిగా జల్లి రామ్మోహన్రావును తిరిగి ఎన్నుకున్నారని కౌర్ పెద్దిరాజు ప్రకటించారు. రాబోయే కాలంలో ఈ మండల కమిటీ పని చేస్తుందని ఆయన అన్నారు. నరసాపురం మండలంలో పంట కాలవలు,దర్బరేవు డ్రైన్ పూడిక తీసి ఆధునికరణ పనులు చేయాలని, వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులు అర్హులందరికీ చెప్పాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని,ఎల్విచర్ల గవర్నమెంట్ ఆసుపత్రిని యధావిధిగా పున ప్రారంభించాలని, వెస్ట్ కుక్కి లేరు పూడిక తీసి ఆధునీకరణ పనులు చేపట్టాలని, కొప్పర్రు పీహెచ్ నిర్మాణం చేయాలని మండల మహాసభ తీర్మానం చేసింది.

# సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

**– బూత్ ,క్లస్టర్ ఇన్చార్జిలతో సమావేశం : మాజీ మంత్రి పితాని**



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ బూత్ క్లస్టర్ ఇంచార్జీలు దిశ నిర్దేశం చేశారు సోమవారం ఉదయం పెనుమంట్ర మండలం మార్టేరులో శ్రీ వేణుగోపాల స్వామి ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వ నమోదులో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో లో రెండవ స్థానం, రాష్ట్రంలో 17వ స్థానంలో సభ్యత్వ నమోదు చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మరింత సమయం ఉన్న కారణంగా సభ్యత్వ నమోదు మరింత వేగవంతం చేయాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో నియోజవర్గానికి ఇచ్చిన టార్గెట్ ను అధిగమించడం జరిగిందని అయితే మనతోపాటు ఉన్న మిత్రపక్షాలు బిజెపి జనసేన ఆశించినంత రీతిలో నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కాలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ కూటమి జనసేన బీజేపీ టీడీపీ పార్టీలను కలుపుకునే ముందుకు వెళతామని అన్నారు. అలాగే నీటి వినియోగదారుల సంఘాలకు జరిగే ఎన్నికలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆచంట నియోజకవర్గం పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, మండల పార్టీ అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్,కేతా మీరయ్య పిల్లి సత్తిరాజు,తమ్మినేడి ప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జిలు చింతపల్లి రామకృష్ణ,కర్రి అచ్యుత రామారెడ్డి,రుద్రరాజు రమేష్ బాబు,రుద్రరాజు రవి రాజు ,గూడూరు మురళి, గుబ్బల మాధవ్, మన్నే రమేష్,కోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల హామీని అమలు చేయాలి

## – సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్




**ఏలూరు,మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1వ డివిజన్ వెంకటాపురం సచివాలయం వద్ద ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలసి డివిజన్ కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేద ప్రజలకు చాలీ చాలకుండా పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు,గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు మాత్రమే కేటాయించారని విమర్శించారు.ఆనాటి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వ్యవసాయ కార్మిక సంఘం అనేక దఫాలుగా ఇంటి స్థలాలను పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేద ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఐదేళ్లు పూర్తి కావస్తున్న నేటికీ ఆ ఇళ్ల స్థలాలు ఎల్ల నిర్మాణం పూర్తిస్థాయిలో చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పెంపు హామీని తక్షణం అమలు చేయాలని,ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, సమితి సభ్యులు లక్క పాము చిట్టిబాబు,ఉప్పులూరి రవి, జిజ్జువరపు సురేంద్ర,మూర్తి,లీలా కుమారి, సత్యవతి, అమల, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి : సిపిఎం



**కుక్కునూరు,మేజర్న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పనులపై ఉన్న శ్రద్ధ, ఆ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులపై లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని కుక్కునూరులో సిపిఎం 8వ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు పట్ల లక్ష్మయ్య ఆవిష్కరించారు. అనంతరం భుయ్యాన శ్రీను,శ్యామల లక్ష్మణరావు,పట్ల సితక్క అధ్యక్షతన సభ జరిగింది. తొలుత సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సంవత్సరాలు తరబడి ప్రాజెక్టు కట్టడమేగాని నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, పరిహారం గురించి చర్చే లేదని అన్నారు. సర్వేల పేరుతో కాలం గడపడమేగాని ఏఒక్క నిర్వాసితునికీ న్యాయం జరగట్లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పూర్తి పునరావాసం కల్పించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు సాగించాలని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు,తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, వేలేరుపాడు మండల కార్యదర్శి ధర్మల రమేష్, నేతలు యర్నం సాయికిరణ్,మేడిపల్లి బాబు,మడవి దుర్గారావు,కోట రామలక్ష్మి, షేక్ వలిపాషా,పులదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆయాలకు వేతన బకాయిలను చెల్లించాలి




పెనుగొండ,మేజర్న్యూస్: గత 4నెలలుగా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో పనిచేసే శానిటరీ వర్కర్స్ (ఆయా)కు నేటికీ వేతనాలు చెల్లించకపోవడంపై సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం పెనుగొండ తహశీల్దార్ ఆఫీస్ వద్ద వెంటనే బకాయిలు చెల్లించాలని కోరుతూ తాహశీల్దార్ బి అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2024 జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు ఆయాలకు తక్షణం వేతనాలు చెల్లించాలని, బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 వరకు పనిచేసే ఆయాలకు కనీస వేతనం రూ 18,000 లు చెల్లించాలని కోరారు. వేతనాలు చెల్లించాలని ఈనెల 14న ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు వినతి పత్రం సమర్పించారని సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యులు షేక్ పాదుషా, సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు పాఠశాల ఆయాలు టి దుర్గ, కే ఏసుమణి, వై సునీత, గెడ్డం రమణ, జుత్తిగ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# రావి పద్మకుమారి అంత్యక్రియలు : పలువురి సంతాపం



**ఏలూరు,మేజర్న్యూస్: నగరానికి** చెందిన ప్రముఖ వైద్యులు,జిల్లా కేంద్ర ప్రభుత్వ వైద్యశాల విశ్రాంత సూపరింటెండెంట్ రావి గోపాలకృష్ణయ్య సతీమణి హేలాపురి లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు గత 40సంవత్సరాలుగా వివిధ విభాగాలలో విశిష్ట సేవలు అందించిన లయన్ రావి పద్మకుమారి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా గుండె నొప్పితో మరణించారు, వారి అంత్యక్రియలు సోమవారం ఉదయం అశోక్ నగర్ స్మశాన వాటికలో వారికుటుంబ సభ్యులు నిర్వహించారు.

లయన్స్, రోటరీ, ఇన్నర్ వీల్,మానవత ,సీనియర్ సిటిజన్స్,బ్రహ్మకుమారీస్, దొండపాడు అయ్యప్ప స్వామి దేవాలయం,అలాగే సకల కళాకారుల సంక్షేమ సంఘం, అభినయ నృత్యభారతి,హేలాపురి బాలోత్సవ సంఘం,హిందూ యువజన సంఘం,హేలాపురి కళాకారుల సంఘంవంటి అనేక సంస్థల ప్రతినిధులు పద్మకుమారికి నివాళులు అర్పించారు.

నివాళులు అర్పించిన వారిలో శాసన సభ్యులు బడేటి రాధాకృషయ్య,లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, ఉప గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు,మాజీ శాసన సభ్యులు మరడాని రంగారావు,ఉషా బాలకృష్టారావు, వి.మురళీమోహనరావు, డాక్టర్ సి.శ్రీనివాసరాజు,ఎల్.వెంకటేశ్వరావు, కానాల శ్రీనివాసరావు, కె.బి.రావు, డాక్టర్ ఎం.ఎల్.వి. ప్రసాద్, డాక్టర్ జి.ఎస్. ప్రసాద్, డి.హేమసుందర్, డాక్టర్ సదాశివరావు, శాకమూడి మురళీకృష్ణ, డాక్టర్ నవ్యకళ, ఆలపాటి నాగేశ్వరావు, అనేక మంది ప్రముఖులు ఉన్నారు.

## పుస్తక విజ్ఞానంతోనే ఉన్నత స్థితి : మానవత డైరెక్టర్ తుమ్మల





**భీమడోలు,మేజర్ న్యూస్:** పుస్తక విజ్ఞానం తోనే ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారని మానవతా స్వచ్ఛంద సంస్థ కేరియర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామేశ్వరరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా భీమడోలు శాఖా గ్రంధాలయం 5వ రోజు సోమవారం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలేజీ,ఉన్నత పాఠశాలల విద్యార్థులు వ్యాస రచన,చెస్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల చిన్నారులు పోటీలలో తమ ప్రతిభను చాటారు చెస్ పోటీలకు సత్యేంద్ర న్యాయ నిర్ణీతగా వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణలో పౌరుల పాత్ర పై వ్యాసరచన పోటీలు జరిగాయి. తోలుతా జరిగిన కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తుమ్మల వెంకట ఉమామేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం పోటీలు జరిగాయి. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోండి

: ఎస్ఐ రామచంద్రరావు



**మండవల్లి,మేజర్న్యూస్ :** కంటి వైద్యపరీక్షలు చేయించుకోవడం వల్ల సమ స్యలను తొలిదశలోనే గుర్తించి కంటిచూపును కాపాడుకోవచ్చునని మండవల్లి ఎస్.ఐ సిహెచ్.ఎస్.రామచంద్రరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీ నర్ ఎల్.ఎస్.భాస్కరరావు,మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. గన్నవరం గ్రామంలోని కమ్యూనిటీహాలులో ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల కార్యదర్శి గంజాల శ్రీనివాసరావు,బైరపాటి రామలింగం ఆధ్వర్యంలో ఎల్ వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆకివీడు వారు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన జీవితంలో కళ్ళు ఎంతో ముఖ్యమైన పాత్రపోషిస్తాయని మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడటానికి కళ్ళే మనకు సహాయపడతాయన్నారు. ఉచితకంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేసిన శ్రీనివాసరావు, రామలింగంనుఅభినందిం చారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక బాధ్యులు,గ్రామ ప్రముఖులు గుడివాడ ప్రసాద్, కోనపరెడ్డి కోటేశ్వరరావు సింగనపూడి అప్పారావు, తలపంటి ఆంజనేయులు,రొయ్యూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 100 వంద మందికి పైగా మధ్యాహ్నానికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని,వారిలో 15 మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని టెక్నీషియన్ దుర్గభవాని,సాయి లక్ష్మి తెలిపారు. సాయంత్రం వరకు పరీక్షలు నిర్వహించారు.

## 30 వేల ఎకరాలలో మామిడి తోటల సాగు

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడి తోటలను 30 వేల ఎకరాలలో సాగు చేయబడుతున్నదని దీనికి రైతు సేవ కేంద్రాల ద్వారా ఉద్యాన శాఖ అధికారులు, ఉద్యాన గ్రామా సహాయకులు రైతులకు తగిన సూచనలు,సలహాలు ఇవ్వడం జరుగుతోందని జిల్లాఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా ప్రతి వారం 2 రోజులు గ్రామాలలో ఉన్న ఉద్యాన రైతులకు మామిడి పంటలో యాజమాను, పద్ధతులు మరియు తెగుళ్ళు నివారణ పద్ధతులను ఎప్పటికప్పుడు అవగాహనా కల్పించడం జరుగుతోందన్నారు. మామిడి పరిశోధన కేంద్రం, నూజివీడు నుండి మామిడి శాస్త్రవేత్తల ద్వారా మామిడి పంట గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తు మన్నారు. నెలవారి యాజమాన్య పద్ధతులను రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు సూచించడం జరుగుతుందన్నారు. మామిడి రైతులు దరఖాస్తులను ఇవ్వవలసినదిగా కోరామన్నారు.

# చింతలపూడి ఎత్తిపోతల భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం





## - కలెక్టరేట్ ముందు రైతులు ధర్నా

**ఏలూరు,మేజర్ న్యూస్:** చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు 2015,2016లలో ఇచ్చిన అవార్డు రద్దు చేసి కొత్త అవార్డు ప్రకారం పరిహారం చెల్లించాలని, ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్ ముందు భూ నిర్వాసిత రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, కొత్త అవార్డు ఇవ్వాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు ఎస్. వరలక్ష్మి, కుప్పాల చెన్నయ్య మాట్లాడారు. 2015,2016లలో భూసేకరణకు నోటిఫికేషన్లు ఇచ్చి అవార్డు అవార్డు ఇచ్చారని, ప్రభుత్వం వద్ద నిధులు లేవనే పేరుతో 9 సంవత్సరాల తర్వాత పాత అవార్డు ప్రకారం పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. ప్రైవేట్ మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి భూ నిర్వాసిత రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గవరపు ప్రసాద్ రెడ్డి, మా ఊరి సత్యనారాయణ రెడ్డి, భీమిరెడ్డి మాధవరెడ్డి, కటారి చెన్నయ్య,కె.ప్రసాద్, మాలెంపాటి శ్రీనివాస్, కుప్పాల వీరమ్మ, వేల్పుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జైలును సందర్శించిన న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి



**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం ఏలూరులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారాగారంలోని ఖైదీలకు అందిస్తున్న వసతుల పైన, అలాగే వారికి అందుబాటులో ఉన్న న్యాయవాదులు, కేసులు వివరాలు పైన ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయం చేస్తుందని తెలియజేశారు. ఖైదీలతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులు వాదిస్తున్నారని, అలాగే కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాల పొందటములో ఇటువంటి సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారికి అండగా ఉంటుందని కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. 14 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జాతీయలోక్ కథాలతో నిర్వహిస్తున్నారని రాజీయోగ్యమైన కేసులలోని ముద్దాయిలు సమస్యను పరిష్కరించుకొని కేసు నుండి విముక్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారాగారం సూపరింటెండెంట్ సిహెచ్ ఆర్. వి.స్వామి, జైలర్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** ఐరన్ వైపుతో పామాయిల్ గెలలు కోస్తుండగా జరిగిన ఘటనలో జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో కూలి పనులు నిమిత్తం పొలం పనులకు వెళ్లి పామాయిల్ గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌తో టిడిపి కార్యకర్త తగరం కళ్యాణ్(31) మృతి చెందడు. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఎలక్ట్రికల్ అధికారులు ఏరియా ఆస్పత్రి దగ్గరికి చేరుకున్నారు.

# సంతాన వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

## - రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరపల్లి,మేజర్ న్యూస్:** సంతాన వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. ఆగిరపల్లి మండలము అడవినక్కల పాలెం గ్రామంలో వేంచివున్న శ్రీ శ్రీ శ్రీ సంతాన వేంకటేశ్వరస్వామి వారి ఆలయ శిఖర పునప్రారంభోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది.వేద మంత్రాలతో, బాజా భజంత్రీ లతో మొదటగా మంత్రికి ఘనస్వాగతం పలికిన పిదప ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పునప్రారంభోత్సవ సందర్భంగా ప్రతిష్టించిన వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తదనంతరం మంత్రికి దుశ్శాలువతో ఘనంగా సన్మానించిన్న వేద పండితులు ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతు ప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అందరి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.నూజివీడు నియోజకవర్గ ప్రజలు,జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని అన్నారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు అంత మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలుగుదేశం జనసేన కూటమి నాయకులు గ్రామ పెద్దలు,వెంకటేశ్వరరావు, శ్రీనివాసు, రమేష్, కుటుంబరావు, సతీష్, రాంబాబు, ఆంజనేయులు,తదితరులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సంతాన వేంకటేశ్వరస్వామి ఆశీషులు పొందారు.

# కార్తీక సోమవారం సందర్బంగా భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**భీమడోలు,మేజర్ న్యూస్:**కార్తీకమాసం సోమవారం సందర్భంగా భీమడోలు మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి భీమడోలు శ్రీభీమేశ్వరస్వామి ఆలయం, పొలసానిపల్లి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, గుండుగొలను శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం, అంబరుపేట శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి,పూళ్ల సకలేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు తెల్లవారుజాము నుండి క్యూలైన్లలో బారులు తీరారు. విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.. ఆలయం ఆవరణలో దీపాలు వెలిగించారు.. భారీగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా భీమడోలు శ్రీపార్వతి సమేత భీమేశ్వంస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కాళ్లకూరి ఉమా శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కార్తీకమాసం పురస్కరించుకుని తెల్లవారుజామున నుంచి ఆలయంలో భక్తులు విశేష అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# బాల్యవివాహాలు జరగకుండా చూడాలి

## - ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ ప్రసూన





**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా స్థానికులు చూడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ ప్రసూన , ఝాన్సీ అన్నారు. మండలంలోని చిగురుకోట , పెదగొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,దేవపూడి యూపీ స్కూల్‌లో బాల్యవివాహాల వల్ల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు బాల్య దశలో వివాహాలు జరిపిస్తే కాన్పులో సమస్యలు ,పుట్టిన శిశువు తక్కువ బరువు ఆరోగ్యంగా ఉండరన్నారు. రక్త స్రావం, గర్భస్రావం,రక్తహీనత ,నెలలు నిండకముందే కాన్పులు ,పిల్లలు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిపిస్తే 1098 లేదా 181కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిగురుకోట సర్పంచ్ సిహెచ్ వెంకటేశ్వరమ్మ , చలసాని జగన్మోహన్రావు, కె పద్మ కొడాలి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు నేతల వెంకటరత్నం ,రాజేశ్వరి, అంగనవాడి టీచర్లు అరుణ కుమారి,భవాని,సుభాషిని, చిన్నారి, విజయలక్ష్మి , సచివాలయ పోలీస్ ,ఏఎన్ఎంలు ,ఆశాలు పాల్గొన్నారు.

# జోనల్ లెవెల్ గేమ్స్‌లో విజయం సాధించిన గురుకుల విద్యార్థులు



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: పోలసానిపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జోనల్ లెవెల్ గేమ్ ఓవరాల్ ఛాంపియన్ ఛాంపియన్షిప్ గేమ్స్ లో ద్వారకాతిరుమల గురుకుల పాఠశాల పదిమంది 8వ 9వ 10వ 11 వ తరగతులకు చెందిన విద్యార్థినిలు ఫస్ట్, సెకండ్, థర్డ్, ప్లేస్లలో విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు.చదువులలో ఆటలలోనూ బాలికలు విజయం సాధిస్తున్న సందర్భంగా ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.

# మీకోసం ఫిర్యాదులకు పూర్తిస్థాయిలో పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం,మేజర్‌న్యూస్:** సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరం నందు జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా 169 ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి .. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా.కె.సిహెచ్ అప్పారావులతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మీకోసంలో వచ్చిన ఫిర్యాదులకు మరింత నాణ్యమైన పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్ణీత గడువు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుదారులకు జిల్లా అధికారులు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మీకోసం కార్యక్రమం అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలను జారీ చేశారు.పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు సంబంధిత అధికారులు సరైన సమాధానంతో పరిష్కరించని కారణంగా రీఓపెన్ అవుతున్నాయి అన్నారు.ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సిఎంఓ నుండి రీఓపెన్ ఫిర్యాదులను పర్యవేక్షణ చేసిన అనంతరం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఫిర్యాదుదారులకు సరైన సమాధానంతో పరిష్కారం చేయాలని ఆదేశించారు.

ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు ఫిర్యాదుల్లో కొన్ని గత ప్రభుత్వంలో అధికారులు ఆశావర్కర్ సమస్యలపై చర్చించి వ్రాతపూర్వకమైన హామీలు ఇచ్చారు, వాటన్నిటిని అమలు చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్ల యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ భీమవరం సిహెచ్ లక్ష్మి,డి జ్యోతి, కె లారెన్స్ కుమారి తదితరులు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి మీకోసంలో వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు సమయంలో రైతు సేవా కేంద్రాల్లో నిర్ధారించిన తేమశాతం,నూకశాతాన్ని మిల్లర్లు పరిగణలోకి తీసుకునేలా చర్యలుతీసుకొని రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులసంఘం పశ్చిమగోదావరిజిల్లా కమిటీ మీకోసంలో విజ్ఞప్తి చేశారు. నాఅత్త,మామల ద్వారా నా భర్తకు వచ్చిన 62 సెంట్లు భూమి నాభర్త మరణాంతరం నా పేరున పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చి ఉన్నారు.ఆ భూమిపై అప్పు ఉన్నదని నా మరుదులు ఎటువంటి ఫలసాయము ఇవ్వకుండా నాపై దౌర్జన్యం చేస్తున్నారు. న్యాయం చేయాలి అని భీమవరం మండలం గూట్లపాడు గ్రామము నుండి పొన్నమండ జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. భీమవరం పట్టణం గరగపర్రు రోడ్డు బైపాస్ నాలుగు రోడ్లు కూడలి వద్ద జెఎస్ఎన్ హౌస్ ఆఫ్ఎస్ పిఐ ఆర్ఐటీ పేరుతో కొత్త మద్యం షాపు ఏర్పాటు చేశారు.మద్యం సేవించిన వ్యక్తులు వలనవిద్యార్థులు,మహిళలు, ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నవి, తరచూ ప్రమాదాలు జరుగుచున్నవి అక్కడ నుండి మద్యం షాపును తొలగించాలని స్థానికులు ఎం.సత్యకుమారి, ఆర్.మంగతాయారు, తదితరులు ఫిర్యాదు చేశారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం, పెరికి పాలెం సరిహద్దులులో ఉన్న పోరంబోకు పుంత ఆక్రమణలకు గురి అయినది. ఆక్రమణలను తొలగించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని శృంగవృక్షం, పెరికిపాలెం గ్రామాలకు చెందిన రైతులు కె.నాగరాజు, పి.మురళీమోహన్,గంటామాధవరావు,తదితరులు ఫిర్యాదులో కోరారు. అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో 45ఎకరాలు సాగునీరు అందించే బోదే ఆక్రమణకు గురి అయినది. ఆక్రమణలను తొలగించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆకివీడు చెందిన నిల్ల నాగ కరుణ కుమారి ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వైదోసి రెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పిడి డా.కెసిహెచ్ అప్పారావు. వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకు అభినందనలు

**పాలకోడేరు,మేజర్ న్యూస్ :** శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉండి శాసనసభ్యుడు కనుమూరి రఘురామ కృష్ణంరాజు పదవికి వన్నె తీసుకురావాలని ఆకాంక్షిస్తూ గొల్లలకోడేరుకు చెందిన తెలుగుదేశం నాయకులు కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం అమరావతిలో రఘురామకృష్ణ రాజునూ వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.



# సైబర్ నేరాలపై అవగాహన -అవసరమైనప్పుడు 1930 టోల్ ఫ్రీకి ఫోన్ చేయాలి





ఏలూరు,మేజర్‌న్యూస్ : ప్రస్తుతం సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన కలిగివుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా అధికారులకు సైబర్ నేరాలపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత,బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.అదే విధంగా ఇందుకు నిర్దేశించిన వెబ్‌సైట్ www.cybercrime.gov.in సందర్శించ వచ్చన్నారు. సైబర్ నేరాలపట్ల అందరిలో అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌కు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు బి.మధు వెంకట రాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ సైబర్ నేరాల తీరును వివరిస్తూ,వాటి పట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ఫోన్లలో ఓటిపి, ఓఎల్ఎక్స్, పేటిఎం, గూగూల్ పే,ఫోన్ పే,కేవైసిలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు సందర్శించకూడదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్ సైట్ల ద్వారా సైబర్ నేరగాళ్ళునేరాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్ ఫోన్లో వచ్చే లోన్ యాప్‌ల జోలికి పోవద్దని ఆయన సూచించారు. సైబర్ నేరాలకు లోనైన బాధితులు వెంటనే పోలీస్ వారికి సంబంధిత వివరాలు అందిస్తే సంబంధిత అక్కౌంట్లను బ్లాక్ చేయడం జరుగుతుంద న్నారు. ఎవరైనా పోలీస్ అధికారులమని చెప్పి నేరస్తులు మీపై డ్రగ్స్ కేసు నమోదైయిందని, అసాంఘీక శక్తులతో సంబంధాల ఉన్నాయని ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే సంబంధిత సమాచారం పోలీసులకు అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు, కె.భాస్కరరావు,ఎం. ముక్కంటి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లియో గ్లోబల్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ ఫెయిర్




**ఏలూరు,మేజర్‌న్యూస్:** నగరంలోని శ్రీరామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సోమవారం లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ ఫెయిర్ జరిగింది. ముందుగా శ్రీరామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం మురళీధర్, లియో గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే ప్రసన్న లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విదేశీ విద్య అభ్య సించాలనుకునే విద్యార్థులకు లియో గ్లోబల్ సంస్థ అందిస్తున్న అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. లియో గ్లోబల్ ఈడి కే పర్సనల్ లక్ష్మీ మాట్లాడుతూ యూకే, యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, జర్మనీ, దుబాయ్, తదితర దేశాల్లో గ్లోబల్ సంస్థ తరఫున విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. విద్యార్థిని,విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఉన్నతమైన విదేశీ విద్యను అభ్యసించాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీశ్రీశ్రీ సీతారామాలయంలో లక్ష దీపోత్సవం

**- ముఖ్య అతిథిగా ఆర్టీసీ రీజనల్ చైర్మన్ అప్పల నాయుడు**



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక శనివారపు పేట,హై స్కూల్ రోడ్డు, గంగానమ్మ అమ్మవారి గుడి వద్ద, దారుగ వారి వీధిలో వేంచేసియున్న శ్రీ సీతారామాలయంలో కార్తీక మాసంలో 3 వ సోమవారం సందర్భంగా లక్షా దీపోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ బోర్డు విజయవాడ జోన్ చైర్మన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి,నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు హాజరై అఖండ దీపారాధనను వెలిగించి లక్షా దీపోత్సవాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ అతి పవిత్రమైన కార్తీక మాసంలో సోమవారం ఇంత మహోన్నతమైన లక్ష దీపోత్సవం కార్యక్రమానికి నాకు ఆహ్వానం పలకడం చాలా సంతోషదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి వీల్ చైర్ అందించిన జిల్లా కలెక్టర్

**- సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా అండగా ఉంటాం**

**జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి.**



**ఏలూరు,మేజర్ న్యూస్:** కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నూజివీడుకు చెందినకె. సంజనాప్రియకు వీల్ చైర్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సంజనాప్రియను పలకరిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ వారికి సహాయంగా ఉంటామన్నారు. దివ్యాంగులు వీల్ చైర్స్ లేక నడవలేని స్థితిలో ఉన్నవారికి చాలా సహాయంగా ఉపయోగపడే వీల్ చైర్స్ నందించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన సంజనాప్రియ అర్జీని పరిశీలిస్తూ ఆమెకు ప్రస్తుతం అందుతున్న ఆరువేల పెన్షన్ ను 15 వేలకు పెంచే విషయంపై అవసరమైన చర్యలు తసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, డిఇఓ వెంకట లక్ష్మమ్మ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.